క్లుప్తంగా

పూదోట లింగావధూత స్వామి ఆరాధన


పూజలు చేస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న పూదోట లింగావధూతస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం పంచామృతాభిషేకం, అష్టోత్తర శత దీప సమాయుక్త నివేదనలు, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దొంతా వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పల్లె నాగేశ్వరరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీరాములు, వజ్రం క్రిష్ణారెడ్డి, రామసుబ్బయ్య, వీరన్న పాల్గొన్నారు.

దరిచేరని దీపం పథకం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటైన దీపం పథకం పేదల దరికి చేరడం లేదని ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం ఐద్వా కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత గ్యాస్ పథకం కింద తీసుకున్న సిలిండర్‌కు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని తెలిపారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షురాలిగా సరిత, ఉపాధ్యక్షురాలిగా గౌసియా, కార్యదర్శిగా షరీనా, సహాయ కార్యదర్శిగా లక్ష్మీ, కోశాధికారిగా పద్మావతితో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలి


సీపీఐ నాయకులతో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

బేతంచెర్ల: సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు 19 రోజుల దీక్షల అనంతరం యాజమాన్యంతో చర్చలు సఫలం కావడంతో విరమించారు. ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌ను పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు మోజెస్, రామ సుబ్బయ్య, అక్తర్, రంగన్న, శ్రీనివాసులు, నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు.

కొట్రికె సుజాత దేవి మృతి


సుజాత దేవి(ఫైల్)

డోన్ టౌన్: దివంగత డోన్ మాజీ ఎంపీపీ కేవీ నాగభూషణం శెట్టి భార్య, ప్రస్తుతం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొట్రికె ఫణిరాజ్ తల్లి కొట్రికె సుజాతదేవి(75)ఆదివారం మృతి చెందారు. ఈమె మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతురాలికి కుమారుడు ఫణిరాజ్‌తో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆమె కోడలు కొట్రికె గాయత్రీదేవి గతంలో డోన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టడమే మోదీ లక్ష్యం


మోదీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ నాయకుల ర్యాలీ

డోన్ టౌన్: అన్ని రంగాల్లో భారత దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, నియోజకవర్గ కన్వీనర్ సంధు వెంకటరమణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్‌రెడ్డి అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనపై ఆదివారం బీజేపీ నాయకులు విజయోత్సాహక సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి శ్రీకృష్ణదేవ రాయ సర్కిల్ వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. బీజేపీ నాయకులు రవికుమార్, బద్రీ సుధాకర్, బొగ్గరపు నటరాజ్, మురళి, లింగన్న, చల్లా దామోదర్‌రెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూన్ భారం

- రైతులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం
- ఏటా పెరుగుతున్న ఎరువులు, విత్తన ధరలు
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు
- ఈ నెల ఆర్థికంగా పెద్ద పరీక్ష


పాఠశాల విద్యార్థులు


వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు (ఫైల్)

బేతంచెర్ల: జూన్ నెల అంటే చాలామందికి కొత్త ఆశలు. రైతుకు పంట సాగు మొదలు పెట్టే సమయం. పిల్లల స్కూల్‌లు కూడా ఈ నెలలోనే మొదలవుతాయి. కానీ ఈ రెండూ ఇప్పుడు సామాన్య కుటుంబాలపై భారంగా మారాయి. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు జూన్ నెల ఖరీఫ్ సీజన్ మొదలయ్యే సమయం. అయితే, ఎరువులు, విత్తనాల ధరలు ఏటా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఏటా ఇదే కాలంలో రైతులు మార్కెట్ వెళ్లి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. అయితే విత్తనాలు, ఎరువుల గతేడాదితో పోలిస్తే ధరలు బాగా పెరిగాయి. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు తెచ్చి పంట సాగు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చూస్తే, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అదే స్థితిలో ఉన్నారు. జూన్ నెల అంటే స్కూల్ ఫీజుల నెల. విద్యార్థుల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు దడ పుట్టిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు మినహాయిస్తే, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు మాత్రం సంవత్సరానికొకసారి కొత్త పేర్లతో ఫీజులు పెంచేస్తున్నాయి. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ల్యాబ్ ఫీజు, బస్ ఫీజు... ఇలా పేర్లు మారినా, తల్లిదండ్రులపై పడే భారం మాత్రం ఆగట్లేదు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా స్కూల్‌లో చేర్పించాలి అనుకుంటున్నారు. కానీ స్కూల్ ఫీజుల పెరుగుదల వల్ల మధ్య తరగతి, కింది తరగతి ప్రజలు బలవుతున్నారు. ఈ నెల రైతులకు, విద్యార్థుల తల్లిదండ్రులకూ ఆర్థికంగా ఓ పెద్ద పరీక్షగా మారింది.

జూన్ వచ్చిందంటే ఇబ్బందులే



ఏటా జూన్ నెల వచ్చిందంటే ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. అటు వ్యవసాయానికి, ఇటు పిల్లల చదువులకు డబ్బులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు, ఎరువులు, విత్తనాలు అందజేయమే కాకుండా ప్రభుత్వ విద్యావ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలి.

–చంద్రశేఖర్ రెడ్డి, అంబాపురం

అధిక ఫీజులను నియంత్రించాలి



నాకు ముగ్గురు సంతానం. అమ్మాయి ఇంటర్మీడియెట్, ఇద్దరు అబ్బాయిలు 9, 10 తరగతి చదువుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఏటా ఫీజులు పెంచేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అలాంటి ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. పేద మధ్య తరగతి కుటుంబాలకు ఫీజులు తలకు మించిన భారంగా మారింది.

–మహబూబ్ బాషా, ఆర్ఎస్ రంగాపురం

రైతులకు భారంగా వ్యవసాయం



రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. ప్రభుత్వం భరోసా కల్పించడం లేదు. పెట్టుబడి సాయం లేదు. రాయితీపై విత్తనాలు, ఎరువుల ఊసే లేదు. కష్టాలు పడి ఎలాగోలా పంట సాగు చేసినా మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. గతంలో జూన్ నెలలో రైతులకు పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు అందేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

–మురళీధర్‌రెడ్డి, మద్రికుంట గ్రామం

ప్రభుత్వ ఆదరణ కరువు

రైతులకు ప్రభుత్వం నుంచి భరోసా లభించడం లేదు. పెట్టుబడి సాయం అందడం లేదు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రకటనలు చేస్తున్నా రైతుల ఖాతాలకు నగదు జమకాలేదు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతు ధరల పెంపు, ఎరువుల ధరల నియంత్రణ, అలాగే విద్యా రంగంలో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మీర్జాపురంలో కార్డన్‌సెర్చ్


సోదాలు చేస్తున్న పోలీసులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మీర్జాపురంలో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ గోపాల్, సిబ్బందితో కలిసి ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో నాటు సారా విక్రయాలు అధికంగా ఉండడంతో పలు కాలనీల్లోని అనుమానితుల ఇళ్లలో విస్తృతంగా సోదాలు చేశారు. అనంతరం రామాలయం సమీపంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. మద్యానికి బానిసలుగా మారితే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గ్రామంలో నాటుసారా అమ్మకాలు లేకుండా చేయాలన్నారు. వ్యసనాలకు దూరంగా మెలిగి పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు. చాలా మంది మద్యానికి బానిసలుగా మారడంతో పాటు బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ మాయలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. వాటన్నింటికి దూరంగా ఉండాలని సూచించారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

డోన్ టౌన్: శాస్త్రీయ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో జేవీవీ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. శాస్త్రీయ విజ్ఞానం పెరుగుతున్నా ప్రజల్లో మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు తగ్గకపోవడం విచారకరమని తెలిపారు. దొంగ బాబాల మాయాజాలంలో పడకూడదని, రుజువు లేనిదే దేనిని నమ్మవద్దని, సైన్స్‌ను మాత్రమే నమ్మాలన్నారు. సైన్స్ అభిమానులు, ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు జన విజ్ఞాన వేదిక సభ్యులుగా చేరి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. జేవీవీ నాయకులు లతీఫ్, రామ్మూర్తి, ఎస్ఎస్ బాబు, ప్రకాష్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న చరణానంద భారతిస్వామి


హాజరైన భక్తులు

ధైవారాధనతో మోక్షం

బేతంచెర్ల: భగవంతుని ఆరాధనతో మోక్షం సిద్ధిస్తుందని రాజాశ్రమ పీఠాధిపతులు క్రిష్ణ చరణానంద భారతి స్వామి, చైతన్య మాతాజీ అన్నారు. ఆదివారం పట్టణంలో పూదోట లింగావధూతస్వామి వారి ఆరాధన ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగం వినిపించారు. పితృవాక్య పరిపాలకుడిగా రాముడు, మాతృవాక్య పరిపాలకులుగా పాండవులు నిలిచారన్నారు. అందుకు నిదర్శనంగా పాండవులు శరీరకంగా కష్టాలపాలైనా ఆత్మ సంబంధంగా మోక్షాన్ని పొందారని తెలిపారు. రాగ ద్వేషాలకు దూరంగా ఉంటే భగవంతుని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, చంద్రమౌళి, భజన కృష్ణయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గోస్పాడు: రేవనూరు గ్రామానికి చెందిన ఠాగూర్ (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యువకుడికి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది మండల కేంద్రమైన గోస్పాడు సమీపంలో శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు తల్లి మరియమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

26న జాబ్‌మేళా

నందికొట్కూరు: ఈ నెల 26న నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీ. శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సునీతతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 10 ప్రైవేట్ కంపెనీలు వస్తాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీ.టెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం 91548 30286, 76739 02328 గల సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

మహానందిలో భక్తుల సందడి



మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు కల్యాణోత్సవం పూజలు వైభవంగా జరిగాయి.

ప్రమాదకరంగా మారిన రోడ్డు


కల్వర్టుపై ప్రమాదకరంగా మారిన ఇనుప కడ్డీలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్ రంగాపురం వద్ద రోడ్డుపై ఇనుప కడ్డీలు ప్రమాదకరంగా మారాయి. ప్యాపిలి–బనగానపల్లె రహదారిలో ఎన్ రంగాపురం వద్ద సీసీ రోడ్డు దెబ్బతింది. కల్వర్టుపైన నిర్మించిన రోడ్డు దెబ్బతిని ఇనుపకడ్డీలు బయటపడ్డాయి. ఆ మార్గం మీదుగా వెళ్లే వాహన చోదకులు దీన్ని గమనించక కడ్డీలపైనే వెళ్తున్నారు. పదునుగా ఉన్న కడ్డీలు టైర్లకు గుచ్చుకుని పంచర్లవుతున్నాయి. దీంతో తరచుగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుపై దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, కలుగొట్ల, కొప్పెర్ల గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. రేవనూరు, అల్లూరు, కొత్తపల్లె ఫీడర్లకు సంబంధించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

ఆవులను రోడ్లపై వదిలితే చర్యలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రోడ్లపై ఆవులు సంచరిస్తే గోశాలకు తరలిస్తామని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆవులు రోడ్లపై సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని..రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు గోవుల యజమానులకు తెలిపినా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఇకపై ఆవులు రోడ్లపై సంచరిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాటిని గోశాలలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గజ్జల పూజ

ప్యాపిలి: మండల పరిధిలోని కొమ్మేమర్రి గ్రామంలో ఆదివారం గజ్జల పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోలాటం నేర్చుకున్న బాలబాలికలు, యువత తాము నేర్చుకున్న కళను గురువుకు, జాతికి అంకితం చేసేందుకు గజ్జల పూజను నిర్వహిస్తారు. కొమ్మేమర్రి గ్రామంలో కొద్ది రోజులుగా కోలాటం మాస్టర్ కేవీ మధు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని గజ్జల పూజలో భాగంగా మధును శిష్యబృందం సభ్యులు సత్కరించారు. రామాయణం, భారతం, జానపద గీతాలు, సినీ గీతాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం అలరించింది. కార్యక్రమాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మట్కా బీటర్ అరెస్ట్

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన మట్కాబీటర్‌ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన బాలయ్య మట్కాబీట్ నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి అతని వద్ద నుంచి మట్కా చీటీలు, రూ. 6 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


పోతుదొడ్డి జెడ్పీ పాఠశాల ఆవరణలో ఇరుకుగా ఉన్న వంట గది,


ఆరుబయట వంట వండుతున్న నిర్వాహకులు

ఆరుబయటే వంటలు..!

ప్యాపిలి: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా నామకరణం చేసింది. అయితే పథకం అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండటానికి వంట గదులు నిర్మించారు. అయితే ఏమాత్రం ముందు చూపు లేకుండా, సరైన ప్రణాళిక లేకుండా నిర్మించిన వంట గదులు నిరుపయోగంగా మారాయి. వంట గదులు చిన్నవిగా నిర్మించిన కారణంగా వంట పాత్రలు కూడా ఆ గదుల్లో సరిపోవడం లేదు. దీంతో నిర్వాహకులు ఆరుబయట చెట్ల కిందే వంట వండుతున్నారు. వంట నిర్వాహకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉండి వంట పాత్రలపై మూతలు పెట్టకపోతే పై నుంచి పురుగులు, కీటకాలు వంట పాత్రల్లో పడే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి విశాలమైన వంట గదులు నిర్మించి అందులోనే వంటలు చేసే ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చివరి మజిలీకి చింతే!

- శ్మశాన వాటిక దూరమై ఇక్కట్లు

కొలిమిగుండ్ల: స్థానిక జమ్మలమడుగు రోడ్డు చుట్టుపక్కల ఉండే కాలనీ వాసుల్లో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికి దూరంగా ఉండడంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కస్తూర్బా పాఠశాల సమీపంలోని జగనన్న కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, మోడల్ స్కూల్ సమీపంలో కాలనీలు ఏర్పాటయ్యాయి. జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో పలు నివాసాలు ఉన్నాయి. అక్కడి వారు చనిపోతే ప్రధాన రహదారిలోని బ్రిడ్జి కింద ఉన్న శ్మశాన వాటిక వద్దకు తీసుకురావాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు. దూరంగా ఉండడంతో తాడిపత్రి నుంచి వైకుంఠ రథాన్ని తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు వేలాది రూపాయలు వెచ్చించి రథాన్ని తెప్పించుకోలేక అతి కష్టం మీద అంత్యక్రియలకు మృతదేహాలను తీసుకెళ్లాల్సి వస్తోంది. క్రాస్ రోడ్డులో ప్రభుత్వ భూమి చాలా ఉందని, అధికారులు పరిశీలించి శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయిస్తే ఇబ్బందులు తప్పుతాయని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు.

పత్తాలేని జీలుగ విత్తనాలు

- ప్రభుత్వం మొండి చెయ్యి
- రైతుల ఆవేదన


పొలంలో జీలుగ పంటను కలియదున్నుతున్న రైతన్న (ఫైల్)

బనగానపల్లె: ఖరీఫ్ సీజన్ ప్రవేశించి 20 రోజులైనా రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ చేయకుండా కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపుతోంది. దీంతో వరి సాగు చేసుకునే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా జీలుగ విత్తనాలను జూన్ మొదటి వారంలోనే 50 శాతం సబ్సిడీపై పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా ఐదు ఎకరాలకు సరిపడేలా 60 కేజీ వరకు రైతులకు పంపిణీ చేసేవారు. ఈ ఏడాది కూడా వరి సాగు చేసే రైతులు జీలుగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో వ్యవసాయ బోర్లు, ఎస్సార్‌బీసీ కింద 10,844 హెక్టార్లలో వరిసాగు చేస్తారు. ఇందులో బనగానపల్లె మండలంలో 3,800 హెక్టార్లు, అవుకు మండలంలో 4061, కోవెలకుంట్లలో 1395, సంజామలలో 1119, కొలిమిగుండ్లలో 469 హెక్టార్లలో సాగు చేస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా క్రమం తప్పకుండా జూన్ మొదటి వారంలోనే జీలుగ విత్తనాలను పంపిణీ చేసేవారు. పొలంలో జీలుగ విత్తనాల సాగుతో వరి పంట వేసే భూమి సారవంతంగా మారుతుంది. రసాయన, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గుతుంది. ఫలితంగా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. అధిక దిగుబడులు వస్తాయి. జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గంలో సాగునీటి సౌకర్యం ఎక్కువగా ఉన్నందున వరి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీలుగ విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి జీలుగ విత్తనాల పంపిణీపై ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.


జీర్ణోద్ధరణ చేయక ముందు ఆలయం


జీర్ణోద్ధరణ తర్వాత శోభ సంతరించుకున్న ఆలయం

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన శోభ

కొలిమిగుండ్ల: శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో స్థానిక కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం దశాబ్దాల తర్వాత నూతన శోభ సంతరించుకుంది. గర్భగుడితో పాటు ప్రాకారం శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్వ వైభవం ఎప్పుడు వచ్చేనా అని భక్తులు మదనపడుతుండేవారు. 2022లో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆలయాన్ని రూ.7కోట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చింది. అనివార్య కారణాలతో నిర్మాణ పనుల్లో ఆలస్యం చోటు చేసుకున్నా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గర్భగుడి, మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు. శిల్పకళ ఉట్టిపడేలా చర్యలు తీసుకున్నారు. ప్రాకారాన్ని దిగువ భాగం నుంచి పటిష్టంగా నిర్మాణం చేశారు. గతంలో ఉన్న మెట్ల మార్గాన్ని మార్పు చేశారు. మూడు అంతస్తుల గాలిగోపురం స్థానంలో ఐదు అంతస్తులు నిర్మించారు. మెట్ల నుంచి ఆలయంపై వరకు జిగేల్ మనేలా విద్యుత్ దీపాలు అమర్చారు. ఏడేళ్ల నుంచి స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు జరగడం లేదు. లక్ష్మీనరసింహస్వామి దర్శన భాగ్యం అతి త్వరలో రానుండడంతో భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. జూలై 28 నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.